క్లుప్తంగా

నేడు మహాపడిపూజ మహోత్సవం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని అష్టలక్ష్మి శ్రీ చక్రసహిత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం మహాపడిపూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ సలహాదారులు నీల విజయ్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మహాపడి పూజ మహోత్సవానికి బ్రహ్మశ్రీ సత్యనారాయణ గురుస్వామి చింతపల్లి గురుస్వామి, చిట్టడి ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి హాజరుకానున్నట్లు తెలిపారు. మహా పడిపూజా మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్షుడు బూరుగు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కాంశెట్టి హరీష్, కోశాధికారి సముద్రాల మహేశ్‌లు కోరారు.

కుల గణనపై హామీని నిలబెట్టుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం కుల గణనను చేపట్టాలని తెలంగాణ టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ పోగుల సైదులు గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు అంచలంచెలుగా ఎదిగిన రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగా బడుగు, బలహీన వర్గాల పేదలకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కుల గణనను చేపట్టాలని కోరారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న రేవంత్‌రెడ్డి ప్రజలకు మంచి చేయాలన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

మిర్యాలగూడ : రాష్ట్రంలో నిర్వీర్యంగా ఉన్న విద్యావ్యవస్థను నూతన ప్రభుత్వం బలోపేతం చేస్తుందని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొనకంచి వీరరాఘవులు, ఒంటెద్దు భిక్షంరెడ్డిలుఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం వారు స్థానికంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. టీచర్ పోస్టుల భర్తీకి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నందున వాటిని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

12 నుంచి తపాలా ఉద్యోగుల సమ్మె

నేరేడుచర్ల : ఆలిండియా గ్రామీణ డక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డక్ సేవక్‌ల యూనియన్ల పిలుపు మేరకు ఈనెల 12 నుంచి తపాలా ఉద్యోగులు చేపట్టబోయే సమ్మెను విజయవంతం చేయాలని గ్రామీణ తపాల ఉద్యోగుల డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు కోరారు. గురువారం నేరేడుచర్లలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు 8 గంటలు పని విధానం అమలు చేయడంతో పాటు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు అమలు చేయాలని కోరారు. సీనియర్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు.

నిరుపయోగంగా కేజీబీవీ భవనం

- రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోని విద్యాలయం
- పనులు మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- జెడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న పాఠశాల




నిరుపయోగంగా ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవనం

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) ప్రారంభానికి నోచుకోగా నిరుపయోగంగా మారింది. ఈ పాఠశాలలో కేవలం 80శాతం పనులు మాత్రమే పూర్తికాగా మరో 20 శాతం పనులకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విద్యాలయానికి చుట్టు ప్రహరీ నిర్మాణం పూర్తి కాలేదు. ఈ పాఠశాలను ప్రస్తుతం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతుంది. అయితే ఆ పాఠశాలలో ఒక వైపు విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో పాటు మరో వైపు ఇరుకుగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రెండేళ్ల కిందటే పనులు ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కిందటే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యక కేంద్రం సమీపంలోనే రెండెకరాల భూమిని సేకరించి ఆ భూమిలో రూ.2.70కోట్లతో అన్ని వసతలతో కూడిన భవన నిర్మాణం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోనే రెండేకరాల భూమిని సేకరించి రూ.2.70కోట్ల సొంత భవన నిర్మాణం చేపట్టారు. కానీ భవనం నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. ఆ భవన నిర్మాణ పనులు పూర్తయితే, త్వరగా ఆ పాఠశాలను అందులోకి మార్చితే మా కష్టాలు తీరుతాయని విద్యార్థినులు పేర్కొంటున్నారు. ఈ విద్యాలయంలో ఇంకా పనులు కూడా పెండింగ్‌లో ఉండటంతో త్వరలోనే టెండర్లు వేసి మిగిలిన పనులను పూర్తి చేసి ఆ భవనంలోకి మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకొనున్నారు.

విద్యార్థినులకు అందనున్న నాణ్యమైన విద్య

భవన నిర్మాణ పూర్తయి కేజీబీవీ సొంత భవనంలో కొనసాగితే విద్యార్థినులకు ఉత్తమ విద్య, సౌకర్యమైన వసతులు చేకూరనున్నాయి. అయితే ఆ పాఠశాలలో ఇప్పటికే 150మంది విద్యార్థినులు విద్యను కొనసాగిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతో పాటు చక్కటి హాస్టల్ వసతిని కల్పించి ఆంగ్ల మాధ్యమంలో మంచి భోధనను అందించనున్నారు. చదువుతో పాటు వివిధ ఆటలపై ప్రత్యేక శిక్షణను కూడా అందిస్తున్నారు. విద్యార్థినులకు మంచి భోజనం యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందించి మెరుగైనా విద్యను అందిస్తున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

అడవిదేవులపల్లి మండల కేం ద్రంలో రూ.2.70 కోట్ల తో నిర్మిస్తున్న కేజీబీవీ విద్యాలయంలో పనులు పూర్తి కాలేదన్నారు. దీంతో ఆ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. పెండింగ్ పనులను త్వరతిగతి పూర్తి చేసి ఈ విద్యాలయంలోని మార్చాలన్నారు.

– కుర్ర సైదానాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

కొత్త టెండర్లు పిలుస్తాం

ప్రస్తుతం విద్యాలయంలో పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్ భవనం నిర్మించారు కానీ కాంట్రాక్టర్ అందుబాటులో రాకపోవడంతో తిరిగి కొత్త టెండర్లు వేసి మిగిలిన పనులను పూర్తి చేసిన తరువాత ఆ భవనంలోకి విద్యాలయాన్ని మార్చేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం.

– శైలజ, సర్వశిక్షాభియాన్, డీఈ నల్లగొండ

మాజీ సర్పంచ్ స్వామినాయక్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుముల గ్రామ మాజీ సర్పంచ్ జటావత్ స్వామినాయక్ (66) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాలియా పట్టణంలోని మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మృతి చెందిన స్వామినాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో తిరుమలగిరి (సాగర్) ఎంపీపీ భగవాన్‌నాయక్, జిల్లా మున్సిపల్ కౌన్సిలర్ ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు రమావత్ మంగ్తానాయక్, రమావత్ మోహన్ నాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, సీకే యూత్ అధ్యక్షుడు బండి రమేష్, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు మద్దిమడుగు మార్క్, నాయకులు రావులపాటి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ పట్టణ అధ్యక్షుడిగా రమేష్



మునుగోడు: తెలంగాణ మాదిగ జేఏసీ మునుగోడు పట్టణ అధ్యక్షుడిగా జీడిమడ్ల రమేష్ నియమితులయ్యారు. సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి చంద్రస్వామి గురువారం రమేష్‌కు నియామక పత్రం అందజేశారు.

ఆరుగురి రిమాండ్

చందంపేట : మండలంలోని కోరుట్ల గ్రామంలో నవంబర్ 30 తేదీన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య జరిగిన ఘర్షణతో కార్యకర్తలు గాయపడ్డారు. అయితే ఆ రోజులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆరుగురిపై కేసు నమోదైంది. గురువారం వారిని అరెస్ట్ చేసిన కోర్టులో హాజరుపరుచగా వారిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జమీరొద్దీన్

మాడుగులపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ జమీరొద్దీన్ సూచించారు. మండలంలోని పాములపాడు, ఆగామోత్కూర్, చిరుమర్తి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. 15శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. రవాణాలో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ అక్తర్‌అలీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్దసంఖ్యలో పూజలో పాల్గొన్నారు. అనంతరం కోట్ల శ్రీలక్ష్మి జగదీశ్ దంపతుల సహకారంతో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అన్నదాత దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాల దారులు తోటపల్లి కృష్ణ, బోడకుమార్, భూతరాజు సైదులు, లింగయ్య, శివ స్వాములు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న అయ్యప్ప మాలధారులు

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి కృష్ణవేణి

కొండమల్లేపల్లి : గ్రామాల్లో భ్రూణ హత్యలు, లింగ వివక్ష, బాల్యవివాహాలు జరగకుండా అంగన్‌వాడీలు క్షేత్రస్థాయిలో తమవంతుగా తగిన బాధ్యతను పోషించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామ సమీపంలో ఉన్న రైతు వేదికలో గురువారం నిర్వహించిన మిషన్ వాత్సల్య విజ్ఞాన్ శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ‘భేటీ బచావో.. భేటీ పడావో’ అనే కార్యక్రమం ద్వారా ఆడపిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ప్రతి నెలా రెండో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఉదయ, ఏసీడీఓ శాంతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తిప్పర్తి రాధ, మంజుల, వరలక్ష్మి, రజిత, తారకమ్మ, సువర్ణ, ప్రమీల, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, స్వాతి, సునీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



మిర్యాలగూడలోని ఓ కాలనీలో ప్రహరీ వెంట పడేసిన చెత్త



చెత్తాచెదారంతో నిండిన డ్రైయినేజీ

- చెత్తాచెదారంతో నిండిన డ్రైయినేజీలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో పలు వార్డులో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. అలాగే ఖాళీ స్థలాల్లో ప్రజలు చెత్తను వేస్తుండడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. పన్నులు సకాలంలో వసూలు చేసే అధికారులు సౌకర్యాలు కల్పించడంతో శ్రద్ధ చూపడం లేదంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై గట్టిగా అడిగితే మున్సిపాలిటీలో సిబ్బంది లేరని అధికారులు పేర్కొంటున్నారు.

అధ్వానంగా డ్రైయినేజీలు

మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. దీంతో పూడికతీత నీటి ప్రవాహానికి అడ్డంగా మారి మురుగునీరంతా రోడ్లపైకి చేరుతుంది. అదే విధంగా మరి కొన్ని చోట్ల వర్షపు నీటితో జనవాసాల్లోకి చేరుతుంది. మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో స్పందించి మురుగు కాల్వల్లో పూడికతీతను తొలగించి, చెత్తాచెదారన్ని ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించాలని పట్టణవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

డ్రైయినేజీల్లో పూడిక తీయాలి



డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. డ్రెయినేజీల్లో చెత్తాచెదారంతో నిండిపోయాయి. వాటిలో పూడికను సరిగా తీయడం లేదు. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపడితే ఈ సమస్య ఉండదు. అధికారులు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలి.

– దయాకర్, మిర్యాలగూడ

నా దృష్టికి తీసుకురావాలి



మున్సిపాలిటీలో ఎక్కడైన సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీ వ్యవస్థను మెరగుపరచడంతో పాటు పారిశుధ్య వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలియజేస్తాం.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం



దేవరకొండలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నామమాత్రంగా అధికారుల చర్యలు

దేవరకొండ: ప్లాస్టిక్ భూతం నానాటికీ విస్తరిస్తోంది. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుండటంతో పర్యావరణం దెబ్బతింటోంది. మూగజీవాలు సైతం వీటిని తిని మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. సంబంధిత అధికారులు దుకాణాల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారికి జరిమానాలు విధించినప్పటికీ వాటి వినియోగం మాత్రం తగ్గడం లేదు.

జరిమానాలు విధించినా..

అధికారులు తనిఖీల సమయంలో ముందుగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా మళ్లీ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానాలు సైతం విధిస్తున్నారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. అయితే అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండటంతో పలువురు ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు..

ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిషేధం విధించినప్పటికీ ప్లాస్టిక్ వ్యర్థాలు మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా పేరుకుపోతున్నాయి. అధికారులు జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడంతో నిషేధం అమలు కావడం లేదు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరి మికొట్టేందుకు జూట్ బ్యాగులను వినియోగించా లని అధికారులు, పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఇప్పటికే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాం. అంతేకాకుండా వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి వారికి కూడా అవగాహన కల్పించాం. పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు సైతం విధించాం. 120 మైక్రాన్లకు పైగా ఉన్న కవర్లను మాత్రమే వాడాలి. ముమ్ముందు విస్తత తనిఖీలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు అధికారులకు సహకరించాలి.

– సక్రునాయక్, పర్యావరణ ఇంజనీర్, దేవరకొండ

రాష్ట్రస్థాయి పోటీలకు మంగళపల్లి విద్యార్థులు

నకిరేకల్ :ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో ఈ నెల 8 నుంచి 9 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నకిరేకల్ మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చింతకాయల పుల్లయ్య గురువారం తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న శివాణి, అనిల్, వేణు, ఎనిమిదో తరగతి చదువుతున్న శివ, శ్రీవిద్య, శివాని, అను ఎంకయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు అభినందించారు.

గుండ్లపల్లి కాంగ్రెస్ శ్రేణులకు బహుమతి అందజేత



చెక్కు అందజేస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో అత్యధిక మెజార్టీ వచ్చింది. ఈ సందర్భంగా గురువారం నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి సొంతంగా రూ.50 వేలను జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య చేతుల గుండ్లపల్లి గ్రామ పార్టీ శ్రేణులకు బహుమతిగా అందజేశారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతో గుండ్లపల్లి గ్రామంలో కోమటిరెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. జె.కె రాజు, ఎంపీటీసీ సహదేవ్, మాజీ సర్పంచ్ పనస శంకర్, గ్రామశాఖ అధ్యక్షుడు రేగట్టె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ..

చలి ఎక్కువ కావడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్ని దుస్తులు అమ్మే దుకాణాలు వీధుల వెంట వెలిశాయి. దీంతో నల్లగొండ పట్టణ ప్రజలతోపాటు వివిధ గ్రామాల ప్రజలు తమకు అవసరమైన స్వెటర్లు, బ్లాంకెట్లు,ఇయర్ క్యాప్స్ కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నల్లగొండ










నల్లగొండ జిల్లా కేంద్రంలో స్వెటర్లు, ఇయర్ క్యాప్స్, రెయిన్ కోటళ్లు, బ్లాంకెట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న బోగి శాంతారావు

శాలిగౌరారం: దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ ఇంజనీర్, క్రైస్తవ బోధనల ముఖ్య ప్రసంగీకుడు బోగి శాంతారావు అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గోదల సత్తిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గోదల వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్‌హాల్‌లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు బోడ ఇజ్రాయిల్, తాందారి సీమోను, వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.